క్లుప్తంగా

దేశ రక్షణ ప్రతి పౌరుడి బాధ్యత



మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖ్ సురేష్‌కుమార్

కర్నూలు కల్చరల్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో ఆదివారం ఏక్యాంప్ మాంటిస్సోరి పాఠశాలలో నగర సాంఘిక్‌ను నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ ప్రచార ప్రముఖ్ కురిడి సురేష్‌కుమార్ ముఖ్య వక్తగా మాట్లాడుతూ.. దేశ రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు దేశ రక్షణలో పాలు పంచుకోవడంతో పాటు సమాజ సంఘటితానికి పాటు పడాలన్నారు. సమాజ సేవ చేస్తూ హిందూ జాతిని జాగృతం చేయాలని తెలిపారు. డాక్టర్ చల్లా వాసురెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

హిమోఫీలియా బాధితులకు వైద్య శిబిరం



బాలుడికి ఫిజియోథెరపి చేస్తున్న వైద్యుడు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు చాప్టర్ హిమోఫీలియా సొసైటీ అధ్యక్షుడు ఆర్.పార్థసారథి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బుధవారపేటలోని కేశవ మెమోరియల్ స్కూల్‌లో హిమోఫీలియా బాధితులకు వైద్యశిబిరం నిర్వహించారు. ఇంటాస్ ఫౌండేషన్ సౌజన్యంతో 120 మందికి ఇన్హిబిటార్ స్క్రీనింగ్ టెస్ట్‌ను ఉచితంగా నిర్వహించారు. ఫిజియోథెరపిస్ట్ లోకేష్ హిమోఫీలియా ఇబ్బందులను అధిగమించడానికి ఫిజియోథెరపి ఎలా ఉపయోగపడుతుందో వివరించారు. దానికి అవసరమైన కిట్లను ఇంటాస్ సంస్థ ఉచితంగా అందజేసింది. ఫ్యాక్టర్ 9 వారికి ఒక్కొక్కరికి 1200 యూనిట్ల ఇంజెక్షన్లను అందజేశారు. ఇంటాస్ ఫౌండేషన్ సభ్యులు కె. రామునాయుడు, సీహెచ్ రామకృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం



మట్టలతో ర్యాలీ నిర్వహిస్తున్న హోలీ ట్రినిటీ చర్చి సభ్యులు, క్రైస్తవులు

కర్నూలు (టౌన్): క్రీస్తు మార్గం అనుసరణీయమని హోలీ ట్రినిటీ చర్చి పాస్టరేట్ రెవరెండ్ సామ్యేల్ పీటర్ అన్నారు. ఆదివారం స్థానిక ఎస్‌నగర్‌లోని హోలీ ట్రినిటీ చర్చి ఆధ్వర్యంలో మట్టల ఆదివారం నిర్వహించారు. చర్చి సభ్యులు, క్రైస్తవులు ఈస్టర్ పండుగకు ముందు వచ్చే మట్టల (ఈతాకులు) ఆదివారం పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. క్రీస్తు జెరూసలేమ్‌కు చేరిన రోజును గుర్తు చేసుకుని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో జి. సుదర్శన్ రావు, ఆర్‌ఎస్. వినోద్ బాబు, క్రిస్టోఫర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుటే కోడ్ ఉల్లంఘన



పోలీసు అవుట్ పోస్టుకు టీడీపీ నాయకుల పోస్టర్

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్ ఎదుట ఉన్న పోలీస్ అవుట్ పోస్టుకు దర్జాగా టీడీపీ నాయకుల పోస్టర్లు ఉన్నా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అధికారులు అటువైపు చూడడంలేదు. నిత్యం ఉన్నతాధికారులు సైతం అదే దారిలో వెళ్తున్నా దాని వైపు చూసి తొలగించేందుకు చర్యలు తీసుకోవడంలేదు. ఇప్పటికే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి పది రోజులు అవుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు.

కొబ్బరి బోండాల లారీ బోల్తా

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి పట్టణ సమీపంలోని డోన్ రైల్వే గేటు అవతల హైవే -44 యు జంక్షన్‌లో కొబ్బరి బోండాల లోడ్‌తో వెళ్తున్న హర్యానాకు చెందిన లారీ బోల్తా పడింది. మధురై నుంచి కొబ్బరి బోండాల లోడ్‌ను ఢిల్లీకి తీసుకెళ్తూ డోన్ దాటుకుని వచ్చి ఆదివారం తెల్లవారుజామున అదుపుతప్పి బోల్తా పడింది. లారీ ఉన్న డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడగా కొబ్బరిబోండాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. రూ.లక్షల్లో ఆస్తి నష్టం సంభవించింది. హైవే పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ప్రమాదానికి గురైన లారీని పక్కకు తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.



‘మేమంతా సిద్ధం’ సభను విజయవంతం చేద్దాం

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని
- కల్లూరు, ఓర్వకల్లు మండలాల నేతలతో సన్నాహక సమావేశం



మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

కల్లూరు: నంద్యాల జిల్లాలో ఈ నెల 28న జరగనున్న మేమంతా సిద్ధం కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం తన స్వగృహంలో కల్లూరు అర్బన్, కల్లూరు గ్రామీణ, ఓర్వకల్లు మండలాల నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ నెల 27న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం పేరుతో బస్సు యాత్ర ప్రారంభిస్తున్నారని తెలిపారు. బస్సు యాత్ర ఇడుపులపాయలో ప్రారంభమై ఇచ్ఛాపురం వరకు కొనసాగుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇడుపులపాయలోని దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి సమాధి వద్ద నివాళులర్పించి, యాత్ర ప్రారంభిస్తారన్నారు. సాయంత్రం ప్రొద్దుటూరులో బహిరంగ సమావేశంలో పాల్గొని అదే రోజు రాత్రి నంద్యాల జిల్లా ఆళగడ్డలో రాత్రి బస చేయనున్నారని తెలిపారు. 28న సాయంత్రం నంద్యాలలో బహిరంగ సభలో పాల్గొంటారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

2019 ఫలితాలు పునరావృతం

మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో నంద్యాల జిల్లాలో మరోసారి 2019 ఫలితాలే పునరావృతమవుతాయని ఎమ్మెల్యే అన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు సిద్ధం సభలు ఘన విజయం సాధించాయని తెలిపారు. మేమంతా సిద్ధం బస్సు యాత్ర సభలు కూడా అదే తరహాలో విజయవంతమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఎన్నుకోవడానికి ప్రజలంతా సంసిద్ధంగా ఉన్నారన్నారు.

నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందింది

వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో పాణ్యం నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని ఎమ్మెల్యే అన్నారు. ఓర్వకల్లు మండలంలో నిర్మించనున్న మల్లికార్జున రిజర్వాయర్‌తో కల్లూరు అర్బన్, ఓర్వకల్లు, గడివేముల మండలాలకు సాగు, తాగు నీరు అందుతుందన్నారు. అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, చేయూత, సున్నావడ్డీ, జగనన్న వసతి దీవెన, విద్యా దీవెన వంటి పథకాలతో పేద ప్రజల జీవితాలు మెరుగుపడ్డాయన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలతో ప్రజల చెంతకే పాలన తీసుకొచ్చామన్నారు. గ్రామాల్లోనే సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల చెంతకు పాలన తీసుకొచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. గతంలో రైతులు పంటలకు కావాల్సిన ఎరువులు, పురుగు మందుల కోసం జిల్లా, మండల కేంద్రాలకు వెళ్లేవారని.. ప్రస్తుతం ఆర్‌బీకేలోనే అన్ని రకాల ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంటున్నాయని తెలిపారు. గడివేముల మండలంలో జొన్న రైతులపై టీడీపీ నాయకులు అసత్యాలు, అబద్ధాలు ప్రచారం చేశారన్నారు. జొన్న రైతులు ఇబ్బందులు పడకుండా మార్క్‌ఫెడ్ అధికారులతో మాట్లాడి పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు తన పాలనలో ఏనాడు రాయలసీమ అభివృద్ధి గురించి ఆలోచించలేదని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, కల్లూరు అర్బన్‌లోని కార్పొరేటర్లు, ఓర్వకల్లు, కల్లూరు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హంద్రీకి చేరిన ఎల్‌ఎల్‌సీ నీరు



ముడుమలగుర్తి వద్ద హంద్రీకి చేరుతున్న నీరు

కోడుమూరు రూరల్: వర్షాభావ పరిస్థితులు, వేసవి ప్రభావంతో హంద్రీ నది ఎండిపోయి నదీ పరివాహక ప్రాంతాలైన కోడుమూరు, వర్కూరు, ముడుమలగుర్తి, గోరంట్ల గ్రామాల్లో తీవ్ర మంచినీటి సమస్య తలెత్తింది. నీటి సమస్య పరిష్కారం కోసం జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఇరిగేషన్ అధికారులు వారం రోజుల నుంచి ఎల్‌ఎల్‌సీ నీటిని వర్కూరు శుద్ధ వాగు మీదుగా 40 క్యూసెక్కుల చొప్పున హంద్రీ నదిలోకి విడుదల చేస్తున్నారు. ఈ నీరు ఆదివారం సాయంత్రం నాటికి కోడుమూరు దాటి ముడుమలగుర్తి గ్రామంలోని హంద్రీ నదికి చేరుకుంది. మరో నాలుగైదు రోజుల పాటు నీటి ప్రవాహం ఇలాగే కొనసాగితే గోరంట్ల గ్రామాన్ని చేరడంతో పాటు, త్వరలో జరిగే గోరంట్ల తిరునాలకు వచ్చే భక్తులకు నీటి సమస్య తీరుతుంది.

వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి ఇంటా సంతోషం

- కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్
- 22వ వార్డుకు చెందిన పలువురు వైఎస్సార్‌సీపీలో చేరిక
- నగరంలో బైక్ ర్యాలీ
- పాల్గొన్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీలో చేరిన బీక్యాంపు యువకులతో ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్

కర్నూలు (టౌన్): వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో ప్రతి కుటుంబం సంతోషంగా ఉందని.. సంక్షేమ పాలన కొనసాగాలంటే మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాలని ఆ పార్టీ కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్ అన్నారు. ఆదివారం నగరంలోని 22వ వార్డుకు చెందిన యువకులు బాలు నాయకత్వంలో పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికీ ఇంతియాజ్, ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బాలు, హేమలత, ఆనంద్, ప్రవీణ్, కళ్యాణ్, శివ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా యువకులు సి.క్యాంపు సెంటర్ నుంచి హౌసింగ్ బోర్డు కాలనీ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. బి.క్యాంపు వద్ద ఏర్పాటు చేసిన సభలో ఇంతియాజ్ మాట్లాడుతూ.. ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన జనరంజక పాలన చేశారని తెలిపారు. అన్ని వర్గాలకు సమన్యాయం జరిగిందన్నారు. కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా ప్రతి కుటుంబానికి సంక్షేమాన్ని అందించారని తెలిపారు. మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ.. కర్నూలు నగరాన్ని తన హయాంలో క్లీన్‌సిటీ, గ్రీన్‌సిటీగా తీర్చిదిద్దామని తెలిపారు. పచ్చదనంతో సుందరీకరణ పనులు, పార్కులను అందంగా తీర్చిదిద్దామన్నారు. రూ.500 కోట్లతో శాశ్వత అభివృద్ధి పనులు చేశామన్నారు. సంక్షేమాన్ని అందించిన జగనన్నను, ఇంతియాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

స్థానిక 6వ వార్డు గరీబ్‌నగర్‌లోని ఉత్సాద్ ఖాసీం మసీదులో కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ ముస్లిం మత పెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. దువా చేశారు. ఇఫ్తారు విందులో పాల్గొన్నారు. అంతకు ముందు స్థానిక పాతబస్తీలో అనారోగ్యంతో బాధపడుతున్న ఎంఐఎం నేత మన్సూర్ అహమ్మద్‌ను పరామర్శించారు.



సీఎస్ఐ చర్చిలో ప్రార్థనకు హాజరైన ఇంతియాజ్, ఎస్వీ మోహన్‌రెడ్డి

హోలీ.. ఆనందాల కేళి

- నేడు హోలీ పర్వదినం
- రసాయనాల రంగులతో ప్రమాదం
- సహజ రంగులతో సంతోషంగా వేడుకలు జరుపుకుందాం
- ఇస్కాన్, గోదా గోకులం లలితా పీఠంలో ప్రత్యేక వేడుకలు



కర్నూలు కల్చరల్: కుల మతాలకు అతీతంగా స్నేహ భావనను పెంపొందించే వసంతోత్సవం (హోలీ) అంటే ఏ వయసు వారైనా ఎంతో ఇష్టపడతారు. ఏటా ఫాల్గుణ మాసంలో పౌర్ణమి రోజున వచ్చే ఈ పండుగను హోలీ, కాముని పున్నమి అని కూడా అంటారు. హోలీ అంటే అగ్ని లేదా అగ్నితో పునీతమైనదని అర్థం. సోమవారం హోలీ వేడుకలను ఘనంగా జరుపుకోనున్నారు. మనిషి జీవితంలో రంగులమయంగా ఉండాలని, పౌర్ణమి నాటి చంద్రుడిలా నిండుగా వెలుగొందాలని.. ఆ రోజున రంగుల్లో తేలియాడుతారు. హోలీ పండుగ వెనుక ‘హోళిక’ త్యాగం దాగుందని పురాణాలు చెబుతున్నాయి. మనిషిలో కోరికలను చంపేసుకోవడం అన్న భావనలో కామ దహనం పేరిట కట్టెలపై పాత దుస్తులు, పడేసిన వస్తువులను దహనం చేసే సంప్రదాయం జిల్లాలో ఉంది. దశాబ్దాల కిందటే గుజరాత్, రాజస్థాన్ వంటి ఉత్తర భారత రాష్ట్రాల నుంచి వచ్చి ఎంతో మంది నగరంలో స్థిరపడ్డారు. వారికెంతో ఇష్టమైన హోలీ పండుగను సందడిగా జరుపుకుంటారు. ప్రత్యేకంగా ఓల్డ్ సిటీలోని జైన్ టెంపుల్ ప్రాంతం, లలితా పీఠం, ఇస్కాన్, బొంగుల బజార్ తదితర చోట్ల హోలీ సంబరంగా చేసుకుంటారు. భక్తి చైతన్యానికి నిదర్శనమైన చైతన్య మహాప్రభు జన్మదిన వేడుకలు, సత్యదేవుడి వ్రతాలు కూడా పెద్ద ఎత్తున జరుపుకోనున్నారు.

రసాయనాల రంగులతో ప్రమాదం

రంగు రంగుల్లో తడిసి ముద్దవుతూ ఆనంద సాగరాన విహరింపజేసే ఈ హోలీ పర్వదినం వసంత రుతువులో నిండు పౌర్ణమి నాడు వస్తుంది. ఈ దినాల్లో ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందించడమనేది సహజంగా మారింది. అయితే హోలీలో ఉపయోగించే రంగులు సహజ సిద్ధమైన రంగులనే చల్లుకోవాలి. రసాయనాలు కలిపిన రంగులతో అత్యంత ప్రమాదం పొంచి ఉందని గుర్తించుకోవాలి. ఇళ్లలో తయారు చేసుకునే స్వచ్ఛమైన రంగులను మాత్రమే వాడడం వల్లే కళ్లకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. సహజ రంగులతో సంతోషంగా హోలీ జరుపుకోవాలి.

నిర్లక్ష్యం ఖరీదు.. ఐదు షాపులు దగ్ధం



అగ్ని ప్రమాద బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, ఇంతియాజ్

- చెక్క, స్పేర్ పార్ట్స్ షాపులు, ఆటోలు అగ్నికి ఆహుతి
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, ఇంతియాజ్



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన చెక్కల దుకాణం



పూర్తిగా కాలిపోయిన ఆటో

కర్నూలు(అర్బన్): చిన్న నిర్లక్ష్యం ఐదు షాపులను అగ్నికి ఆహుతయ్యేలా చేసింది. సిగరెట్ తాగి ఆర్పకుండా చెత్త కుప్పలో పడవేయడంతో మంటలు అంటుకుని భారీ ఆర్థిక నష్టానికి దారి తీసింది. నగరంలోని కొత్త బస్టాండ్ సమీపం కల్లూరుకు వెళ్లే దారిలో ఉన్న గొర్రెల సంత జరిగే ప్రదేశంలో ఆదివారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాద సంఘటనలో ఐదు షాపులు దగ్ధమయ్యాయి. ఈ ప్రాంతంలో ఎస్.అబ్దుల్, బి.జాకీర్‌బాషా, ఎస్.మహమ్మద్ ఆలీ, ఎస్‌పి సలీం, సి.శ్రీనివాసులుకు చెందిన టేకు ఉడ్, పేపర్ ప్లేట్స్, కవర్స్, ఆటో స్పేర్ పార్ట్స్, మెకానిక్ షాపులు ఉన్నాయి. షాపుల సమీపంలో ఉన్న చెత్తలో వేసిన సిగరెట్ అంటుకుని సమీపంలోని చెక్క సామాను షాపుతో పాటు పక్కనే ఉన్న ఇతర షాపులకు మంటలు వ్యాపించడంతో భారీగానే నష్టం జరిగింది. మంటల్లో రెండు ఆటోలు పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం అందిన వెంటనే కర్నూలు అగ్ని మాపక సిబ్బంది రెండు ఫైర్‌ఇంజన్ల సహాయంతో అధిక నష్టం జరగకుండా మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఐదు షాపుల్లో కలిపి మొత్తం రూ.60 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు నష్టం ఉంటుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన హఫీజ్‌ఖాన్, ఇంతియాజ్

అగ్ని ప్రమాదం జరిగిందనే సమాచారం తెలిసిన వెంటనే కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, వైఎస్సార్‌సీపీ కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా సంఘటన జరిగిన తీరును, నష్టాన్ని బాధితులు వారి దృష్టికి తీసుకొచ్చారు. జరిగిన సంఘటనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

తరావీ నమాజ్‌తో అల్లాహ్ కృప



దారుల్ మసీదులో తరావీ నమాజు చదివిస్తున్న మౌలానా ఖాజీ అబ్దుల్ మాజిద్ సాహెబ్

కర్నూలు (న్యూటౌన్) : తరావీ నమాజ్ (ప్రార్థన)లో పాల్గొని అల్లాహ్ కృపకు పాత్రులవ్వాలని జమియత్ ఉలామ జిల్లా అధ్యక్షుడు మౌలానా ఖాజీ అబ్దుల్ మాజిద్ సాహెబ్, జిల్లా కార్యదర్శి హఫీజ్ అబ్దుస్ సమీ అసద్ అన్నారు. ఆదివారం దారుల్ మసీదులో నాల్గవ రోజు తరావీ నమాజ్ కొనసాగింది. వారు మాట్లాడుతూ ఈనెల 21 నుంచి 30వ తేదీ వరకు ప్రతిరోజూ రాత్రి 8:30 గంటలకు జరిగే తరావీ ప్రార్థనలో ఖురాన్‌లోని మూడు పారాలు పఠించడం జరుగుతుందన్నారు. ముస్లిం సోదరులందరూ పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు కొనసాగిస్తూ తరావీ నమాజ్‌లో పాల్గొని అల్లాహ్ కృపకు పాత్రులవ్వాలని కోరారు. పది రోజుల్లో తరావీ నమాజులో ఖురాన్‌లోని 30 పారాలు చదివి పూర్తి చేస్తామని అన్నారు.

యథావిధిగా మంచినీటి సరఫరా

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలో మంచినీటి సరఫరా యథావిధిగా కొనసాగుతుందని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఐటీసీ వద్ద 500 ఎంఎం పైప్‌లైన్ మరమ్మతు పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసినట్లు తెలిపారు. దీంతో ఓల్డ్ కల్లూరు, క్రిష్ణనగర్, ఆదిత్య నగర్, కొత్తబస్టాండ్, జంపాల శివయ్య నగర్, తిలక్ నగర్, చల్లా వారి వీధిల్లో మంచినీటి సరఫరా ప్రణాళిక ప్రకారం జరుగుతుందని పేర్కొన్నారు.

పోక్సో కేసు నమోదు

కర్నూలు(అర్బన్): నగరంలోని ఏ క్యాంప్‌కు చెందిన లతీఫ్ అనే వ్యక్తిపై కర్నూలు రెండో పట్టణ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. భార్యతో పాటు ఎనిమిది మంది ఆడ సంతానం కలిగిన ఇతను ఈ నెల 1వ తేదీన 16 ఏళ్ల బాలికకు మాయమాటలు చెప్పి నమ్మించి హైదరాబాద్‌కు తీసుకువెళ్లి వివాహం చేసుకునేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే తమ కూతురు కనిపించడం లేదని బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కావడం, పోలీసులు దర్యాప్తు ప్రారంభించడంతో ఈ నెల 21వ తేదీన బాలికను తిరిగి కర్నూలుకు తీసుకువచ్చాడు. ఇందుకు సంబంధించి లతీఫ్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు రెండో పట్టణ పోలీసులు తెలిపారు.

తైక్వాండోలో ఉచిత శిక్షణ

కర్నూలు (టౌన్): మార్షల్ ఆర్ట్స్ తైక్వాండోలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తైక్వాండో కోచ్ టి. వెంకటేశ్వర్లు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి మే 31వ తేదీ వరకు రెండు నెలల పాటు శిక్షణ ఇస్తామన్నారు. స్థానిక పెద్దమార్కెట్ కేఎంసీ పార్కులో ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 7.30 గంటల వరకు శిక్షణ తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో వెంట తీసుకు రావాలని సూచించారు. వివరాలకు 9849971256 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పిల్లలను క్రీడల వైపు ప్రోత్సహించాలి

చెడు అలవాట్ల బారిన పడకుండా ఉండాలంటే తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల వైపు ప్రోత్సహించాలని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. ఆదివారం స్థానిక నంద్యాల చెక్ పోస్టు వద్ద ఉన్న షిర్డీసాయి నగర్‌లో కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బెల్టులు ప్రదానం చేశారు.

సారా స్థావరాలపై దాడులు

ఓర్వకల్లు : మండలంలోని గుమ్మితంతండాలో నాటు సారా స్థావరాలపై పోలీసులు విస్తృత దాడులు నిర్వహించారు. కర్నూలు రూరల్ సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, స్థానిక ఎస్‌ఐ రాజారెడ్డి పోలీసు సిబ్బంది ఆదివారం మండలంలోని గుమ్మితంతండాలో చేపట్టిన దాడుల్లో 2000 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసి, నిర్వాహకుల నుంచి 50 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సారాను తయారు చేసినా, సారాను విక్రయాలు జరిపినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అలరించిన ‘అవ్వ అప్పచ్చి’ సాంఘిక నాటిక



నాటిక ప్రదర్శిస్తున్న కళాకారులు



శ్రీనివాసులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాకారులు

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రంలో ప్రతి నెలా చివరి ఆదివారం నిర్వహించే సాంఘిక నాటిక ప్రదర్శనల్లో భాగంగా ఆదివారం సాయంత్రం హైదరాబాద్ శ్రీమురళీ నిలయం వారి ‘అవ్వ అప్పచ్చి’ నాటిక ప్రదర్శన జరిగింది. విశ్రాంత జిల్లా కలెక్టర్ బలరామయ్య, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, ప్రముఖ వైద్యుడు మాలకొండయ్య అతిథులుగా నాటిక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగరవాసులు సేద తీరేందుకు ఇలాంటి నాటికల ప్రదర్శనలు అవసరం అన్నారు. ఆహ్లాదంతో పాటు సందేశం ఇచ్చేలా నాటిక కథాంశం ఉండటం అభినందనీయమన్నారు. నాటిక దర్శకుడు విశ్వమోహన్‌ను సన్మానించారు. అంతకు ముందు ఇటీవల పరమపదించిన సీనియర్ రంగస్థల కళాకారుడు శ్రీనివాసులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యదర్శి మహ్మద్ మియ్యా, ఉపాధ్యక్షులు ఇనాయతుల్లా, సీవీ రెడ్డి, కోశాధికారి లక్ష్మీకాంతరావు తదితరులు పాల్గొన్నారు.

టీబీ డ్యాంలో 5.402 టీఎంసీల నీరు



టీబీ డ్యాంలో నిల్వ ఉన్న నీరు

హొళగుంద: ఉమ్మడి రిజర్వాయర్ కర్ణాకటలోని తుంగభద్ర జలాశయంలో ఆదివారం ఉదయం 5.402 టీఎంసీల నీరు నిల్వ ఉంది. సాగు, తాగునీరును అందిస్తున్న టీబీ డ్యాంలో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా నీటి నిల్వ వేగంగా పడిపోయింది. దీంతో ఎల్లెల్సీ కింద ఒక కారు (ఖరీఫ్) పంటకు మాత్రమే సాగు నీరు అందించిన టీబీ బోర్డు అధికారులు రబీకి సాగు నీరివ్వకుండా కేవలం తాగునీటి అవసరాల నిమిత్తం గత నెల 19వ తేదీ నుంచి ఎల్లెల్సీకి 480 క్యూసెక్కుల ప్రకారంగా నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాంలో ఆదివారం ఉదయం నాటికి 1633 అడుగులకు గాను 1581.79 అడుగుల వద్ద నీరు నిల్వ ఉన్నాయి. ఇన్‌ఫ్లో జీరో ఉండగా అవుట్‌ఫ్లో రూపంలో ఎల్లెల్సీకి 844 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇక ఎల్లెల్సీ ఆంధ్ర పరిధి 250 కి.మీ వద్ద 480 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది.

వైభవంగా శ్రీచెన్న సోమేశ్వరస్వామి ఉత్సవాలు

- భక్తులతో కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం
- ఫలహారాల బండ్ల ఊరేగింపు
- నేటి మహారథోత్సవానికి సర్వం సిద్ధం



ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి



ప్రత్యేక అలంకరణలో చెన్న సోమేశ్వరస్వామి

సి.బెళగల్: పోలకల్ గ్రామంలోని శ్రీచెన్న సోమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం జరిగే మహా రథోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. పలువురు భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి ఉత్సవాల సందర్భంగా భక్తులకు వసతితో పాటు గ్రామస్తుల సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆలయ ధర్మకర్త పద్మనాభరెడ్డి తెలిపారు.

ఆకట్టుకున్న భక్తుల ఫలహారాల బండ్లు

శ్రీచెన్న సోమేశ్వరస్వామి ఉత్సవాల్లో ఫలహార ఎడ్ల బండ్లు ఊరేగింపు ఆకట్టుకున్నాయి. ఫలహార బండ్లకు భక్తులు రంగుల కాగితాలు, మామిడి తోరణాలతో సుందరంగా అలంకరించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు ఎడ్ల బండ్లలో ఫలహారాల తీసుకుని ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సి.బెళగల్‌తో పాటు కంబదహాల్, సంగాల, పలుకుదొడ్డి, క్రిష్ణదొడ్డి, ముడుమాల, ఇనగండ్ల, మారందొడ్డి గ్రామాలకు చెందిన భక్తులు ఎక్కువ సంఖ్యలో ఎడ్ల బండ్లపై పోలకల్ చేరుకుని స్వామి వారికి మొక్కులు సమర్పించుకున్నారు. కాగా గ్రామానికి చెందిన కొవ్వ శ్రీరాములుకు చెందిన రెండు పొట్టేళ్లతో ఫలహార బండి ఆకట్టుకుంది. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఐదుగురు ఎస్‌ఐలు, 40 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు కోడుమూరు సీఐ సీఐ మన్సూరుద్దీన్ తెలిపారు.